ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ బీ సత్యప్రసాద్

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

జగిత్యాల, జూలై 1 : ప్రజావాణి లో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ బీ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు రాంబాబు, రఘువరన్‌తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రం తోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వస్తారన్నారు. అధికారులు శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివాలని సూచించారు. ప్రజావాణికి మొత్తం 44 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు, మధుసూదన్, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరగాలి

- ఎస్పీ అశోక్ కుమార్
- గ్రీవెన్స్ డేలో పలు ఫిర్యాదుల పరిశీలన

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

జగిత్యాల, జూలై 1 : బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నెలరోజులపాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. కాగా, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కళాబృందం సభ్యులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కళా బృందానికి సూచించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఇబ్రహీంపట్నం, జూలై 1 : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్‌హెచ్‌వో, రెస్ట్ రూం, లాక్‌అప్‌రూం, ఫైఎస్ అమలు తీరును పరిశీలించారు. ఆయన వెంట మెటుపల్లి డీఎస్‌పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ అనిల్, సిబ్బంది ఉన్నారు.

మెట్‌పల్లి, జూలై1: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సాయంత్రం ఎస్పీ అశోక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడికి మొదటిసారిగా వచ్చారు. కేసులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఇక్కడ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి తదితరులున్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీలతో సభా ప్రాంగణం

గులాబీ జెండాలతో దారి

బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం సక్సెస్

- తరలివచ్చి నాయకులు, కార్యకర్తలు
- గులాబీమయమైన జగిత్యాల పట్టణం

కేటీఆర్‌ను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్ దంపతులు

జగిత్యాల రూరల్, జూలై 1 : జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన జిల్లా బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం సభ సక్సెస్ అయ్యింది. బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీలతో జిల్లా కేంద్రం అంతా గులాబీమయమైంది. జిల్లా నలుమూల నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి పద్మనాయక ఫంక్షన్ హాల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు, గులాబీ తోరణాలతో గులాబీ జెండాలతో చూపరులను ఆకట్టుకున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లా ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేటీఆర్‌ను యాదవ సంఘం ఆధ్వర్యంలో వొల్లెం మల్లేశం, నాయకులు గొంగడితో సన్మానించారు. అలాగే మైనార్టీ నాయకులు పుష్పగుచ్ఛంతో సన్మానించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోసిన్ కేటీఆర్‌ను సన్మానించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, నాయకులు చలిమెడ లక్ష్మీనరసింహారావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్, లోకబాపు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడిపల్లి, జూలై 1 : జగిత్యాల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మేడిపల్లి, భీమారం మండలాల నుంచి నాయకులు బయలుదేరి వెళ్లారు. వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్తిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు ద్యావనపెల్లి అభిలాష్, లోలపు రాజురెడ్డి, అంగడి ఆనంద్‌కుమార్, బంగారు దీపక్ తదితరులున్నారు.

ఎంపీవో వర్సెస్ పంచాయతీ కార్యదర్శి

- జూమ్ మీటింగ్‌లో ఘర్షణ
- ఎంపీడీవో దగ్గరకు చేరిన పంచాయితీ
- క్షమాపణ చెప్పడంతో సద్దుమణిగిన గొడవ

కొడిమ్యాల, జూలై 1 : మండలంలోని 24 గ్రామాలుండగా దాదాపు 15 మంది పంచాయతీ కార్యదర్శులతో, ఎంపీవో, ఎంపీడీవో గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనులపై జూమ్ మీటింగ్ నిర్వహిస్తుండగా ఎంపీవో, పంచాయతీ కార్యదర్శిమ ధ్య మాటల యుద్ధం నడిచింది. చివరికి పంచాయతీ కార్యదర్శిపై ఎంపీవో ఎంపీడీవోకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కార్యదర్శి క్షమాపణ చెప్పడంతో గొడవ సద్దుమనిగింది. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2024 జూన్ 26 బుధవారం మండల కార్యదర్శులతో గ్రామ పంచాయతీలో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వే, హరితహారం, ఫీవర్ సర్వే, ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో స్వరూప, ఎంపీవో వాసవిలు కలిసి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పనులకు సంబంధించి వివరాలపై ఎంపీవో వాసవి కార్యదర్శులను అడుగుతున్నారు. వివరాలు సర్వే రిపోర్టులు సరిగా చెప్పకపోవడంతో మల్యాల మండలంలో నేను ఎంపీవోగా చేసిన సమయంలో అందరు కార్యదర్శులు తమ రిపోర్టులను సరిగా అందించే వారని ఇక్కడ ఎందుకు నిర్లక్ష్యంగా చెబుతున్నారని ఎంపీవో కార్యదర్శులతో అన్నారు. దీనికి నల్లగొండ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ స్పందిస్తూ మీరు మల్యాల ప్రస్తావన ఇక్కడ ఎందుకు తీస్తున్నారని అనడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం మండల పంచాయతీ కార్యదర్శులతో కూడిన వాట్సాప్ గ్రూప్‌లో ఎంపీవో వాసవిపై మీరు ఎన్ని గ్రామాల్లో తిరుగుతున్నారు, ఎన్ని ఫొటోలు గ్రూపుల్లో అప్‌లోడ్ చేశారని వెంకటేశ్ ఘాటుగా మెస్సేజ్ చేశారు. ఈ విషయమై ఎంపీవో వాసవి గురువారం ఉదయం సదరు పంచాయతీ కార్యదర్శిపై దురుసుగా మాట్లాడారని ఎంపీడీవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో స్వరూప ఇద్దరిని కార్యాలయానికి పిలిపించి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్‌తో ఎంపీవో వాసవికి క్షమాపణ చెప్పించింది. ఏదేమైనా మండల స్థాయి కార్యదర్శులు ఉన్న జూమ్ మీటింగ్‌లో, గ్రూప్‌లో పంచాయతీ కార్యదర్శి ఎం పీవోపై అలా మాట్లాడటం సరికాదని పలువురు అంటున్నారు. ఈ విషయమై ఎంపీవో వాసవిని వి వరణ కోరగా ఫిర్యాదు చేసింది నిజమేనని, ఎంపీడీవో ఎదుట సారీ చెప్పాడని తెలిపారు. ఎంపీడీవో స్వరూపను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని గొడవ జరగలేదని తెలిపారు.

సీఐకి సన్మానం

మెట్‌పల్లి, జూలై 1: మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇల్లెందుల కృష్ణమాచారి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం

సారంగాపూర్, జూలై 1 : బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో సోమవారం పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మిట్టపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఆడెపు వెంకటేశ్, కోశాధికారిగా ఆడెపు మల్లేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

మెట్‌పల్లి, జూలై 1: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని అర్బన్ హౌసింగ్ కాలనీలో 21 మంది పేద విద్యార్థులకు సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఇక్కడ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, సభ్యులు రాజేశ్‌లున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మెట్‌పల్లి రూరల్, జూలై 1: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన ఎరుకల నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆయన కుటుంబ సభ్యులకు ఫ్రీడం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కూరగాయలు విక్రయించే నరేశ్ మరణంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో యూత్ సభ్యులు రూ.మూడు వేల నగదును బాధిత కుటుంబానికి అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మారు మురళి, నరేశ్, వెంకటేశ్, నగేశ్, రాజ్‌కుమార్, మారుతి, కిరణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ రిజర్వాయర్ మత్తడి పనులు పునఃప్రారంభం

కథలాపూర్, జూలై 1: కలికోట శివారులో గల సూరమ్మ రిజర్వాయర్ మత్తడి పనులు పునఃప్రారంభించినట్లు నీటి పారుదలశాఖ ఏఈ కార్తీక్ సోమవారం తెలిపారు. పదేళ్ల క్రితం సూరమ్మ రిజర్వాయర్ మత్తడి పనులు మధ్యలోనే ఆపేశారు. కాంట్రాక్టర్ పనులు పునఃప్రారంభించడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్‌కు బైక్‌పై వెళ్లనివ్వడం లేదని..

- గడ్డి మందు తాగిన తొమ్మిదో తరగతి విద్యార్థి
- చికిత్స పొందుతూ మృతి

కథలాపూర్, జూలై 1: స్కూల్‌కు వెళ్లేందుకు బైక్ కొనివ్వలేదని ఓ తొమ్మిదో తరగతి విద్యార్థి గడ్డి మందు తాగి, దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కథలాపూర్ మండలం పోసానిపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోసానిపేటకు చెందిన మారు రాజ్‌కుమార్–లావణ్య దంపతులకు ఇద్దరు కొడుకులు. వీరిలో మణిదీప్ (14) చిన్న కొడుకు. కోరుట్లలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ స్కూటీపై స్కూల్‌కు వెళ్తానంటే తల్లి లావణ్య అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి లోనైన మణిదీప్ గత నెల 24న ఇంట్లోనే గడ్డి నివారణ మందు తాగాడు. అప్పుడు అతనికి ఏం కాలేదు. అయితే 27న ఇబ్బందికావడంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. మణిదీప్‌ను చికిత్స నిమిత్తం జగిత్యాలలోని దవాఖానలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. తండ్రి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

పోస్టల్ ఉద్యోగులకు ఘన సన్మానం

పోస్టల్ ఉద్యోగులను సన్మానిస్తున్న అలయన్స్ క్లబ్ ప్రతినిదులు

కోరుట్ల, జూలై 1: పట్టణంలోని అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ వైద్యుల దినోత్సవం, పోస్టల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన వైద్యులు, పోస్టల్ ఉద్యోగులను శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ అడ్వైజర్ కటుకం రాజేంద్ర ప్రసాద్, జిల్లా గవర్నర్ కటుకం సురేందర్, అధ్యక్షుడు గోనె శ్రీహరి, కార్యదర్శి కటుకం మల్లికార్జున్, కోశాధికారి క్యాతం ప్రసాద్, జిల్లా పీఆర్వో కటుకం రాజశేఖర్, చింతకింది ప్రదీప్ పాల్గొన్నారు.

సమయానుకూలంగా బస్సులు నడపాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్, జూలై 1 : రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే వివిధ గ్రామాల విద్యార్థులకు కళాశాల సమయంలో ఆర్టీసీ బస్సులను నడపాలని కోరుతూ రాయికల్ పట్టణ నాలుగో వార్డు కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బర్కమ్ మల్లేశ్ యాదవ్ కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పేద విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

రంగంపేట స్కూల్లో గుర్తుతెలియని వ్యక్తుల హంగామా

- అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశం
- కోడిగుడ్లు. హైమాస్ట్ లైట్ల ధ్వంసం

రంగపేట పాఠశాల ఆవరణలో పగిలిన కోడిగుడ్లు

సారంగాపూర్, జూలై 1: రంగపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హంగామా సృష్టించారు. ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ, ప్రైమరీ తరగతి గదుల తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి కోడిగుడ్లను పగులగొట్టారు. అలాగే ఉన్నత పాఠశాల ఆఫీస్ తాళం పగులగొట్టి గోడలకు గుడ్లు కొట్టి, సామాను చిందరవందర చేశారు. హైమాస్ట్ లైట్లు పగులగొట్టారు. రెండు లైట్లు ఎత్తుకెళ్లారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సెలవురోజుల్లో నిత్యం ఇలాంటి సంఘటనలు జరగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం మేరకు స్కూల్‌కు పోలీసులు వచ్చి వివరాలు తెల్సుకున్నారు. ఘటనపై ఉన్నత, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

కోరుట్ల రూరల్/రాయికల్/పెగడపల్లి, జూలై 1 : కోరుట్ల, రాయికల్, పెగడపల్లి మండలాల్లో రైతు భరోసాపై వ్యవసాయాధికారులు సోమవారం రైతులనుంచి అభిప్రాయాలను సేకరించారు. కోరుట్ల మండలంలోని ఏకీన్‌పూర్, అయిలాపూర్, పట్టణంలోని కోరుట్ల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయ ఆవరణలో రైతు బంధు పథకంపై రైతుల అభిప్రాయ సేకరణను జిల్లా సహకార సంఘం అధికారి సత్యనారాయణ చేపట్టారు. రైతులు సాగు చేసే భూమికి రైతు బంధు పథకం ఇవ్వాలని, సాగు చేయని భూమికి ఇవ్వవద్దని, ఐదు, పదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు బంధు ఇవ్వాలంటూ రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సహకారం సంఘం ఉపాధ్యక్షుడు పాతర్ల సత్యం, సీఈవోలు బుచ్చన్న, షాజొద్దీన్‌బాబా, జగదీశ్వర్, కార్యవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రాయికల్ మండలం ఉప్పుమడుగు, అల్లీపూర్ సహకార సంఘంలో జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా వ్యవసాయాధికారి వాణి , సింగిల్ విండో చైర్మన్లు మల్లారెడ్డి, రాజిరెడ్డి, రాజలింగం, సీనియర్ ఇన్‌స్పెక్టర్ స్వప్న, సీ ఈవోలు రవికుమార్, ఇన్‌చార్జి సీఈవో జగదీశ్, ఉపేందర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

పెగడపల్లి నంచర్ల ప్రాథమిక సహకార సంఘాల వద్ద సంఘం రైతు భరోసా ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి బీ రామ్మోహన్, నంచర్ల విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, పెగడపల్లి, నంచర్ల విండో ఉపాధ్యక్షుడు వోరుగంటి రాజశేఖర్‌రావు, నామ సురేందర్‌రావు, జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, జూనియర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, సంఘ కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, మధుకర్, విండో డైరెక్టర్లు సుధీర్, సిబ్బంది అనిల్, దామోదర్, రాజు, హైమద్, మల్లేశం, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

మెట్‌పల్లి, జూలై1: ఓ మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని సోమవారం అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం బాసంపల్లికి ఎనుగంటి పృథ్వీరాజ్ (28) హైదరాబాద్‌లోని ఓ మీడియా సంస్థలో పనిచేస్తున్నప్పుడు ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన బాలిక పరిచయమైంది. తరచుగా ఫోన్‌లో మాట్లాడుతూ.. పేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. దీంతో సదరు బాలిక తాను మైనర్‌నని పెళ్లికి ఒప్పుకోలేదు. ఈ యేడాది ఏప్రిల్ 18న పృథ్వీరాజ్ బాలిక ఇంటికి వచ్చి తల్లితో మాట్లాడగా ఇప్పుడే పెళ్లి చేయనని చెప్పింది. దీంతో బాలికను చంపుతానని బెదిరించి బలవంతంగా తన వెంట తీసుకెళ్లాడు. భీంగల్ మండలం సుద్దులం గ్రామంలోని ఓ ఆలయానికి తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. తర్వాత శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడంతో బాలిక మే 30న ఇంట్లో నుంచి పారిపోయి తన తల్లివద్దకు వచ్చి ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో సోమవారం సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ అనిల్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీ చేయగా, ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద పృథ్వీరాజ్ పట్టుబడ్డాడు. దీంతో అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

జగిత్యాల, జూలై 1 : ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని, మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకోవాలని జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత సూచించారు. కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఆదేశాల మేరకు, డిపో మేనేజర్ సునీత ఆధ్వర్యంలో లక్షే లక్ష్యం కార్యక్రమంపై ఆర్టీసీ కళాబృందం ఆటపాటలతో డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జగిత్యాల డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి శ్రీనివాస్, కళాబృందం ఇన్‌చార్జి కమల, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోరుట్ల రూరల్, జూలై 1 : మాదాపూర్‌లో మాజీ సహకార సంఘం అధ్యక్షుడు కట్కం రాజరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబ సభ్యులను సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

లండన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

కోరుట్ల, జూలై 1: లండన్‌లోని భారత హైకమిషనర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించినట్లు తెలంగాణ అసోసియోషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) సంస్థ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల పేర్కొన్నారు. టాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు అనిల్ కూర్మాచలం నాయకత్వంలో భారత హైకమిషన్ ముందు తెలంగాణ ఏర్పాటును ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు గతంలో ఎన్నో నిరసనలు చేశామని గుర్తుచేశారు. నేడు అదే భారత హైకమిషన్ కార్యాలయంలో అధికారికంగా తెలంగాణకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఇక్కడ భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి, గణేశ్ కుప్పలా, నవీన్ రెడ్డి, హరి నవాపేట్, పవిత్ర, సురేశ్ బుడగం, సుప్రజ పులుసు, స్వాతి, స్నేహ, విద్య, రావుల పృథ్వీ, కార్తీక్, నిఖిల్, నవ్య జ్యోతి, దివ్య, శ్రీకాంత్, కుమారి తన్మయలున్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



ధర్మపురి: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 1 : ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 19 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ఆరు గ్యారంటీల్లో 200 యూనిట్ల విద్యుత్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెగ్యాం పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

వెల్గటూర్, జూలై 1 : ఎల్లంపల్లి ముంపు గ్రామం చెగ్యాంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరుతూ వెల్గటూర్ మండల నాయకులతో కలిసి ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెగ్యాం ఎంపీటీసీ రంగు తిరుపతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చెన్న పున్నం, శ్రీనివాస్, లక్ష్మణ